ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు

5

శుక్రవారం 27 సెప్టెంబరు 2024



## డీఎస్‌డీవో బదిలీ

**కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 26:** జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం డీఎస్‌డీవో ఆనంద్ రాజ్‌కుమార్‌ను కర్నూలుకు బదిలీ చేశారు.

● అటవీ శాఖలో ఖాళీగా ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ ఫారెస్టు రేంజ్ అధికారి స్థానాన్ని ప్రభుత్వం భర్తీ చేసింది. బద్వేలు ఎఫ్ఆర్వోగా పని చేస్తున్న రమణారెడ్డిని ఈ స్థానానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలోనూ ఈయన కర్నూలు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వోగా పనిచేశారు.

# దోచిపెట్టారు..!




**ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లు రూపంలో ప్రజా ధనం అప్పనంగా దోచిపెట్టేశారు. భూ సేకరణ చేయకుండానే బాండ్లను విచ్చలవిడిగా జారీ చేశారు. అంతే కాదు భూయజమానికి తెలియకుండానే మరొకరి పేరిట రూ.కోట్లు విలువైన బాండ్లు ఇచ్చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఏకంగా 135 బాండ్లు జారీ చేయడం వెనుక పెద్దల హస్తం ఉన్నట్లు స్పష్టమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కర్నూలు నగర పాలక సంస్థ ఎక్కడా రోడ్ల విస్తరణ చేయలేదు. కనీసం భూ సేకరణ కూడా చేపట్టలేదు.. అయినా విచ్చవిడిగా బాండ్లు జారీ చేయడం వెనుక అంతర్యం ఏమిటి..? నగరవాసులను వెంటాడుతున్న ప్రశ్న ఇది. గత జగన్ ప్రభుత్వంలో జారీ చేసిన బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కుల బాండ్ల విలువ అక్షరాలా రూ. వంద కోట్లకు పైగా ఉంటుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీఆర్ బాండ్ల జారీపై విచారణ చేపట్టడంతో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాల భాగోతం బయటపడుతోంది.**

- టీడీఆర్ బాండ్ల పేరిట రూ.కోట్లు కొట్టేశారు
- వైసీపీ ప్రభుత్వంలో 135 బాండ్లు జారీ
- వాటి విలువ రూ.వంద కోట్ల పైమాటే
- భూమి ఒకరిది.. మరొకరి పేరిట బాండు
- దొంగ నోట్ల తరహాలో విచ్చలవిడిగా చెలామణి
- తాజా విచారణతో కదులుతున్న డొంక
- కర్నూలు నగరపాలక సంస్థలో భారీ కుంభకోణం



**కర్నూలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు నగర పాలక అధికారుల తీరు చూస్తే.. అవినీతి ద్వారాలు బార్లా తెరిచినట్లు స్పష్టంగా తెలుస్తోంది. భూ సేకరణ చేయలేదు. ఎప్పుడు చేస్తారో కూడా తెలియదు. భూ సేకరణకు నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. అయితే మాస్టర్ ప్లాన్‌లో ఆ స్థలాలు, భూములు ఉన్నాయనే ఒకేఒక కారణంతో విచ్చిలవిడిగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లు జారీ చేశారు. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో సుంకేసుల రోడ్డు, బళ్లారి చౌరస్తా-పాత బస్టాండ్ వయా కొత్తబస్టాండ్ రోడ్డు, రాజ్‌విహార్-నంద్యాల చెక్‌పోస్టు రోడ్డు, వైఎస్ఆర్ సర్కిల్ - శ్రీరాం థియేటర్ సర్కిల్ వయా ఐదు రోడ్ల కూడలి రోడ్డు.. ఇలా 12 ప్రధానమైన రోడ్లు మాస్టర్ పాన్ల పరిధిలో ఉన్నాయి. ఎప్పుడు విస్తరణ చేస్తారో స్పష్టమైన ఉత్తర్వులు లేవు. విస్తరణ చేస్తారో లేదో కూడా తెలియదు. మాస్టర్ ప్లాన్ పరిధిలో ఉన్నాయనే ఒకేఒక కారణంతో టీడీఆర్ బాండ్లు జారీ చేయడంపై విమర్శలకు తావిస్తోంది. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. వంద కోట్లకు పైగా విలువ చేసే 135 బాండ్లు జారీ చేయడం వెనుక గత అధికార పార్టీ వైసీపీ ముఖ్య నేతల పాత్ర ఉందని తెలుస్తోంది. బాండ్ల జారీ రూపంలో నగర పాలక సంస్థకు భారీ నష్టాన్ని కలిగించారన్న ఆరోపణలున్నాయి. భూ యజమానులతో సంబంధం లేకుండా, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) కూడా లేకుండా గడువు తీరిన ల్యాండ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ఆధారంగా టీడీఆర్ బాండ్లు జారీ చేయడం వెనుక భారీ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ● టీడీఆర్ అంటే...

రాష్ట్రంలో నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీ విస్తరణలో భాగంగా రోడ్లు, వివిధ కొత్త నిర్మాణాలు కోసం స్థల, భూ సేకరణ చేపట్టే విషయంలో ఆర్థికంగా వెసులుబాటు కోసం మున్సిపల్ శాఖ టీడీఆర్ బాండ్లు జారీ చేస్తుంది. రోడ్ల విస్తరణలో భాగంగా ప్రైవేటు వ్యక్తుల స్థలాలు సేకరించాలంటే పరిహారానికి బదులుగా ఈ బాండ్లు జారీ చేస్తారు. విస్తరణ కోసం అయితే ఆయా ప్రాంతాల్లోని మార్కెట్ విలువపై నాలుగింతలు (1:4 నిష్పత్తి), ఎన్విరాన్‌మెంట్ బఫర్ జోన్ వంటి ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్థల సేకరణకు రెండు రెట్లు రేట్లతో (1:2 నిష్పత్తి) పరిహారంగా బాండ్లు జారీ చేస్తారు. రాష్ట్రంలో ఏ నగరంలోనైనా అదనంగా నిర్మించుకునే భవనాల నిర్మాణాల లైసెన్స్ ఫీజులు, బెటర్‌మెంట్ చార్జీలు, అదనపు బెటర్‌మెంట్ చార్జీలు, 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు తదితర ఫీజులకు బదులుగా ఈ బాండ్లు వినియోగించుకోవచ్చు. విస్తరణలో స్థలాలు కోల్పోయిన యజమానులు ఈ బాండ్లను రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా కొత్తగా భవనాలు నిర్మించుకునే యజమానులకు విక్రయించే అవకాశం ఉంటుంది. ఈ బాండ్లను డిమాండ్‌ను బట్టి 30 శాతం, 50 శాతానికి విక్రయించుకునే పరిస్థితులు ఉన్నాయి. దీంతో భవన నిర్మాణ దారులు మున్సిపల్, పట్టణాభివృద్ధి సంస్థలకు చెల్లించాల్సిన వివిధ ఫీజులు చెల్లించకుండా తక్కువ రేట్లకు ఈ బాండ్లు కొనుగోలు చేసుకొని వినియోగించుకుంటున్నారు.

నిబంధనల ప్రకారం రోడ్ల విస్తరణలో కోల్పోయే స్థలానికి నాలుగింతలు, ఎన్విరాన్‌మెంట్ బఫర్ జోన్‌లో కోల్పోయే స్థలానికి రెండితంలకు బాండ్లు జారీ చేస్తారు. ఉదా: రోడ్డు విస్తరణలో 100 చదరపు మీటర్లు స్థలం కోల్పోతే 400 చదరపు మీటర్లు, ఎన్విరాన్‌మెంట్ బఫర్ జోన్‌లో 100 చదరపు మీటర్లకు 200 చదరపు మీటర్లకు టీడీఆర్ బాండ్లు జారీ చేస్తారు. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో ఓ వ్యక్తి తనకు సంబంధం లేని.. గడువు తీరిన ల్యాండ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ఆధారంగా భూమిని ఎన్విరాన్‌మెంట్ బఫర్ జోన్ కోసం నగరపాలక సంస్థకు సుమారు 1,277 చదరపు మీటర్లు గిఫ్ట్ డీడ్ ఇస్తే.. నిబంధనలు ప్రకారం 2,554 చదరపు మీటర్లు టీడీఆర్ బాండ్ ఇవ్వాల్సి ఉంటే 5,198 చదరపు మీటర్లు ఇచ్చారు. భూ సేకరణ కూడా చేయకుండానే రూ.వంద కోట్లకు పైగా విలువైన టీడీఆర్ బాండ్లు చలామణిలోకి రావడం చూస్తే.. గత అధికార పార్టీ వైసీపీ ముఖ్యనాయకులు, అధికారులు కుమ్మక్కై టీడీఆర్ బాండ్ల పేరిట నగరపాలక సంస్థ ఖజానా అడ్డగోలుగా దోచిపెట్టినట్లు అర్థమవుతోంది. అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా టీడీఆర్ బాండ్లు జారీచేసి సోమ్ము చేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమగ్ర విచారణ చేస్తే భారీ కుంభకోణం వెలుగు చూసే అవకాశం ఉంది. గతంలో టీడీఆర్ బాండ్లు జారీ చేసిన అధికారులు కొందరు ప్రస్తుతం నగర పాలక సంస్థలో కీలక పోస్టుల్లో ఉండడంతో విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందా..? లేదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### ● నిబంధనలకు విరుద్ధంగా బాండ్లు జారీ




### టీడీఎస్ బాండ్ల అక్రమాలపై విజిలెన్స్ విచారణ

కర్నూలు కార్పొరేషన్ అధికారులు విచ్చలవిడిగా జారీ చేసిన టీడీఎస్ బాండ్లపై మంత్రి టీజీ భరత్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ చేయిస్తాం. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా ఈ బాండ్లు జారీ చేశారు. గత ఐదేళ్లలో 135 బాండ్లు జారీ చేస్తే.. చివరి మూడేళ్లలో వందకు పైగా జారీ చేసినట్లు తెలిసింది. పురపాలక శాఖ మంత్రి నారాయణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ బాండ్ల జారీ అక్రమాలపై విచారణ చేయమని ఆదేశించారు. కర్నూలులో టీడీఎస్ బాండ్ల జారీపై విచారణకు రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టరు ఉత్తర్వులు ఇచ్చారు.

- టీజీ భరత్, పరిశ్రమల శాఖ మంత్రి, కర్నూలు

### ● నా దృష్టికి రాలేదు

కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు గత ఐదేళ్లుగా 135 టీడీఆర్ బాండ్లు జారీ చేశారని పత్రికల్లోనే చూశాను. టీడీఆర్ బాండ్లు జారీ విషయం నా దృష్టికి రాలేదు. పట్టణ ప్రణాళిక అధికారులే ఆ బాండ్లను జారీ చేస్తుంటారు. ఇప్పటి వరకు నాకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. నగరంలో చేపట్టే అభివృద్ధి పనులు, వాటికి అవసరమైన నిధులు కేటాయింపులు, కార్పొరేషన్ సమావేశాల్లో తీర్మానాలు వాటి అమలు వరకే మేయర్‌గా నా పాత్ర ఉంటుంది. టీడీఆర్ బాండ్లు జారీ వంటివి పట్టణ ప్రణాళిక, కార్పొరేషన్ అధికారులు నిబంధనలకు లోబడి జారీ చేస్తుంటారు.

- బీవై రామయ్య, మేయర్, నగర పాలక సంస్థ

### ● సమగ్ర విచారణ చేస్తాం

నగరంలో మాస్టర్ ప్లాన్‌లో 12 ప్రధాన రోడ్లు ఉన్నాయి. ఆ రోడ్ల పరిధిలో స్థలాలు కోల్పోయే వారెవరైనా ఎంత విస్తీర్ణంలో స్థలం కోల్పోతారో ఆ వివరాలో గిఫ్ట్ డీడ్ ఇస్తే నిబంధనల ప్రకారం రోడ్డు విస్తరణలో కోల్పోతే నాలుగింతలు, ఇతర ప్రాంతాల్లో జరిగే అభివృద్ధికి కోసం కోల్పోయే స్థలానికి మార్కెట్ విలువను బట్టి రెండింతలు టీడీఆర్ బాండ్లు జారీ చేస్తారు. కర్నూలు కార్పొరేషన్‌లో గత ఐదేళ్లలో 135 బాండ్లు జారీ చేశారు. వీటిలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై విచారణ చేయమని రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన మాట నిజమే. వారం రోజుల్లోగా విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి పంపుతాం.

- ప్రదీప్‌కుమార్, సిటీ ప్లానింగ్ అధికారి

## కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకుందాం

### కలెక్టర్ పి. రంజిత్ బాషా

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26:** ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులతో అన్నారు. గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను, వాటి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు చెత్తను తొలగించారు. మొక్కలు నాటారు. ఫైర్ ఇంజన్ సహాయంతో కలెక్టరేట్ ఆవరణను కలెక్టర్ శుభ్రం చేశారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. ప్రకృతి పరిరక్షణకు పాటుపడుదాం అంటూ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబరు 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు రోజుకు ఒక కార్యక్రమం చొప్పున శుభ్రతా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్, జయసింహ, డీపీవో నాగరాజు నాయుడు, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, హార్టికల్చర్ జిల్లా అధికారి పాల్గొన్నారు.



అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్

### విజన్ ప్లాన్‌పై అభిప్రాయ సేకరణ

స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్ రూపకల్పనకు ఇప్పటి వరకు జిల్లాలో 48,897 మంది క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. అభిప్రాయాలు తెలియజేసిన వారిలో 5,124 మంది విద్యార్థులు, 12,017 మంది రైతులు, 11,051 మంది సెల్ఫ్ ఎంప్లాయీస్, బిజినెస్ వర్గాలు, 5,669 మంది ప్రైవేటు ఉద్యోగులు, 10,412 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 4,624 మంది ఇతరులు ఉన్నారు. అలాగే జిల్లాలో 619 గ్రామసభలు నిర్వహించామని, ఇందులో 1.69 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారని అన్నారు. 7.40 లక్షల స్టిక్కర్లు, 7.40 లక్షల కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశామని తెలిపారు.

## బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదు

### - నా పేరు వాడితే ఫిర్యాదు చేయండి: మంత్రి టీజీ భరత్



**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26:** తన పేరు చెప్పుకుని బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తన పేరు చెప్పి బెదిరిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన అధికారులు, ప్రజలకు పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా ప్రజా క్షేత్రంలో టీజీ కుటుంబం ఉంటోందన్నారు. తాను ఏ పని చేసినా పారదర్శకంగా ఉంటుందని, ఇది ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందన్నారు. ప్రజలందరూ ఇది గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. తన పేరును దుర్వినియోగం చేస్తూ ప్రజలను, ఇతర వర్గాలను ఇబ్బందులు పెడితే సహించబోమన్నారు. అవినీతిపరులు, అక్రమార్కుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**పచ్చి మిర్చి ధర అమాంతంగా పడిపోయింది. కేజీ రూ. 2 కు దిగజారిపోయింది. మిరపకాయలను అమ్మకానికి తీసుకెళితే కనీసం గిట్టుబాటు ధర కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. చేతికి వచ్చిన పంటను రైతులు తొలగిస్తున్నారు.**

## రైతు కంట మిరప కన్నీరు

### ● ధర పడిపోవడంతో పంటను తొలగించిన రైతులు



మిరప పంటను తొలగిస్తున్న కూలీలు



**పత్తికొండ టౌన్, సెప్టెంబరు 26:** పత్తికొండ మండలంలో ఈ ఏడాది 507 హెక్టార్లలో మిరప పంటను రైతులు సాగు చేశారు. గత ఏడాది మంచి ధర పలకడంతో ఈసారి కూడా లాభాలు ఉంటాయని బోరుబావుల కింద మిరప పంటను అధికంగా సాగు చేశారు. ఎకరాకు రూ. లక్షపైగా పెట్టుబడి పెట్టారు. తీరా పంట దిగుబడి వచ్చే సరికి ధరలు ఘోరంగా పడిపోయాయి. కనీసం కూలీలు కూడా రాకపోవడంతో చేసేదేమి లేక పంటను తొలగించేస్తున్నారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో రైతు సురేంద్రనాథ్ రెడ్డి ఎకరన్నర పొలంలో మిరప సాగు చేశాడు. పెట్టుబడి కింద సుమారు రూ.1.50 లక్షల దాకా ఖర్చు చేశాడు. పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తున్న సమయంలో ప్యాకెట్ ధర రూ.50కు కూడా తీసుకోవడం లేదు. దీంతో రైతు గురువారం కూలీలను పెట్టి పంటను తొలగించేశాడు. సరేంద్రనాథ్‌రెడ్డి ఒక ఉదాహరణ మాత్రమే. మండలంలో ఇలాంటి మిర్చి రైతులు ఎందరో ఉన్నారు. అమ్మకానికి వెళితే మార్కెట్‌లో వ్యాపారులు కిలో ధర రూ.2కు కొని రూ.20 చొప్పున అమ్ముకుంటున్నారు.

## జగన్‌కు శ్రీవారిని దర్శించుకునే హక్కు లేదు

### ● సోమిశెట్టి

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26:** అన్యమతస్తుడైన జగన్మోహన్ రెడ్డికి తిరుమలలో శ్రీవారిని దర్శించుకునే హక్కు లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నగరంలోని 25వ వార్డులోని జరిగిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీవారి లడ్డుప్రసాదంలో కల్తీకి పాల్పడిన జగన్ రెడ్డికి స్వామి వారిని దర్శించుకునే నైతిక హక్కు లేదన్నారు. ఆయన గుండు గీయించుకుని, పంగనామాలు పెట్టు డిక్లరేషన్ ఇచ్చి వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలని అన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేసినందునే జగన్‌కు ఎన్నికల్లో ప్రజలు పంగ నామాలు పెట్టారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు వంద రోజుల పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతు కూడగట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాగరాజు యాదవ్, నంద్యాల నాగేంద్ర, సోమిశెట్టి నవీన్, అబ్బాస్, హనుమంతరావు చౌదరి, విజయలక్ష్మి, ముంతాజ్, ఎస్కే బషీర్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సోమిశెట్టి

# కూటమి నేతలను గౌరవించాలి

### ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ● ఆదోనిలో 'ఇది మంచి ప్రభుత్వం'

**ఆదోని, సెప్టెంబరు 26:** కూటమికి చెందిన నాయకులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే గౌరవించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆదోని పట్టణంలోని ఎంకే పాఠశాల మైదానంలో 'ఇది మంచి ప్రభుత్వం' ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ప్రకాష్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ ఆదోనిలో కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి గెలుపులో మీనాక్షి నాయుడు కీలక భూమిక పోషించారన్నారు. ఆయన ఒక్కసారి మాట ఇస్తే మాట తప్పే వ్యక్తి కాదన్నారు. ఆదోనికి మెడికల్ కాలేజ్, బైపాస్ రోడ్డు, రోడ్డు విస్తరణ.. ఇలా అనేక సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో పనిచేసిన వారిని గుర్తిస్తామని అందుకు అనుగుణంగా నామినేటెడ్ పోస్టులు ఇస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రంగులు పూసి రాజకీయం చేశారన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి లడ్డులో సైతం కల్తీ నెయ్యిని వినియోగించి భక్తుల మనోభావాలను దెబ్బతీసారన్నారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ వంద రోజుల పాలనను ప్రజలు ఆమోదించారని, ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసి ప్రజల పాలనను ప్రజలు ఆదరిస్తున్నారంటే దానికి ప్రధాన కారకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరిల ఘనతేనన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ అన్నివిధాల నష్టపోయిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే గాడిలో పెట్టిందన్నారు. గత ఎమ్మెల్యేకు పొద్దున లేస్తే కబ్జాలు, అక్రమ సంపాదన ధ్యాస తప్పితే అభివృద్ధి గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. పట్టణంలో అక్రమ కట్టడాలు ఉంటే బుల్డోజర్లతో కూల్చివేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, టీడీపీ నాయకులు ఉమాపతి నాయుడు, భూపాల్ చౌదరి, బత్తిన కుబేర్‌నాథ్, మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి, దేవేంద్రప్ప, గుడిసె కృష్ణమ్మ, ఉమ్మి సలీం, తిమ్మప్ప, బుద్ధారెడ్డి, లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ పార్వతమ్మ, రేణువర్మ, నాగరాజ్ గౌడ్, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.



పార్థసారథి, మీనాక్షినాయుడు, తిక్కారెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

### మీనాక్షి ప్రసంగం కాగానే వెళ్లిపోయిన ప్రజలు..!

ఆదోనిలో సమావేశంలో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ప్రసంగించారు. ఈ ప్రసంగం అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడాల్సి ఉంది. అయితే మీనాక్షి నాయుడు ప్రసంగం అయిపోగానే టీడీపీ నాయకులు, మరికొంతమంది ప్రజలు కుర్చీలను ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఒక్కసారిగా వందలాది మంది టీడీపీ కార్యకర్తలు సమావేశం నుంచి వెళ్లిపోయారు. వెంటనే మైకు తీసుకుని మీనాక్షి నాయుడు అలా వెళ్లడం సరి కాదు అందరూ కూర్చోవాలని కోరినప్పటికీ టీడీపీ కార్యకర్తలు వినిపించుకోలేదు. దీంతో సభలో కుర్చీలు వెలవెల బోయాయి. స్టేజ్‌పై ఉన్న కొందరు నాయకులు కూడా వెళ్లిపోవడంతో కూటమిలో లుకలుకలు బహిర్గతమయ్యాయి.

## ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీలు

కర్నూలు, సెప్టెంబరు 26: ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు పురుగులు, ఎరువుల మందుల దుకాణాల్లో గురువారం తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు సీఐలు పి. రామకృష్ణ, కే సునీల్, తహసీల్దార్ వెంకటనారాయణ, ఏవో రూపస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు జిల్లాలోని ఆదోని మండలంలో శ్రీనందీశ్వర ట్రేడర్స్‌లో ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువగా విక్రయిస్తున్నందున 3.375 టన్నులు సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే ఆదిత్య ట్రేడర్స్‌లో 3.87 టన్నుల యూరియాను సీజ్ చేసి దుకాణంలో 130.25 టన్నుల ఎరువుల విక్రయాలను తాత్కాలిక నిలుపుదల చేశారు. అలాగే కల్లూరు మండలంలో ముకుంద ట్రేడర్స్ విజయలక్ష్మి ఎరువుల దుకాణాల్లో నిల్వలకు వ్యత్యాసం ఉన్నందున రూ.3.13 లక్షలు విలువ గల ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపేశారు. నంద్యాల జిల్లాలోని ఎర్రగుంట్ల, శిరివెళ్ల మండలాల్లో శ్రీశ్రీ ఎరువుల దుకాణంలో అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తుండటంతో 23.4 టన్నుల యూరియను సీజ్ చేశారు. అలాగే శ్రీగురు ఏజెన్సీస్‌లో రికార్డు స్టాక్‌లో వ్యత్యాసం ఉన్న కారణంగా రూ.9.98 లక్షల విలువ ఎరువుల విక్రయాలు నిలుపుదల చేశారు.

## ఎక్సైజ్ డీసీగా పోతుల శ్రీదేవి


కలెక్టర్‌ను కలిసిన ఎక్సైజ్ శాఖ కమిషనర్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ డైరెక్టర్‌గా పోతుల శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎక్సైజ్ శాఖలో వచ్చిన మార్పులు, నూతన ఎక్సైజ్ విధానం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

## బధిరులు మనోధైర్యంతో ముందుకు సాగాలి

### విభిన్న ప్రతిభావంతుల ఏడీ రయిజ్ ఫాతిమా


సమావేశంలో మాట్లాడుతున్న బధిరులు సంక్షేమ శాఖ అధికారి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26: బధిరులు మనో ధైర్యంతో అన్ని రంగాల్లో విజయం సాధించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిజ్ ఫాతిమా అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవం, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ పథకాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం బధిరుల కోసం 2018-19 నుంచి 2022-23 వరకు 25 పోస్టులను నియామకం చేపట్టిందన్నారు. డాక్టర్ నాగ ప్రసాద్ మాట్లాడుతూ బధిరులు మనోధైర్యంతో గృహాల నుంచి బయటకు రావాలని, అందరూ విద్యను అభ్యసించాలని, సంఘాలుగా ఏర్పడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చినట్లైతే పరిష్కరించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. అంతకుముందు జిల్లా పరిషత్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ సాల్మన్ రాజు, ఖాజా బధిరుల సంఘం వైస్ ప్రెసిడెంట్, ప్రభుత్వ బధిరుల ఉద్యోగుల సంఘం సభ్యులు వాసుదేవరెడ్డి, సాధిక్ బాషా, షుకూర్ బాషా, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం రౌండ్ టేబుల్ సమావేశం

● దీక్షలు విజయవంతం చేయాలని వక్తల పిలుపు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అక్టోబరు 1, 2, 3 తేదీల్లో చేపట్టబోయే దీక్షలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాక్రిష్ణ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్మిక కర్షక భవన్లో సీఐటీయూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా నిర్మించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నష్టాల్లోకి నెట్టివేసి ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. 500 మంది ఉద్యోగులను పక్క రాష్ట్రాల ఫ్యాక్టరీలకు బదిలీ చేసే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని కోరారు. దీక్షలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, శ్రీనివాసరావు, నాగన్న, లలితమ్మ, సోమన్న పాల్గొన్నారు.

## పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 26: పారామెడికల్ కోర్సులకు రెండో ఫేజ్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే చిట్టినరసమ్మ తెలిపారు. పారా మెడికల్ కోర్సులో చేరడానికి మొదటి ఫేజ్‌లో మూడు కౌన్సెలింగ్‌లు పూర్తి కాగా అందులో మిగిలిన సీట్లకు రెండో ఫేజ్ కింద అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇంటర్ విద్యార్హత కలిగిన వారికి సంబంధించిన రోస్టర్ కేటగిరికి చెందిన విద్యార్థులు రూ.100 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని, అక్టోబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి అక్టోబరు 9 ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. సీట్లు రోస్టర్ వివరాలు ఇలా ఉన్నాయి. డార్క్ రూం అసిస్టెంట్ కోర్సులో బీసీ(ఏ)కి ఒక సీటు బీసీ(డీ)కి ఒక సీటు, ఓసీ-ఈడబ్ల్యూఎస్‌కు 1, డీఎంఐటీ కోర్సులో ఎస్టీకి 1, డీఆర్‌జీఏ కోర్సులో ఓసీ-ఈడబ్ల్యూఎస్‌కి 1, డీఏఎన్ఎస్ కోర్సులో ఓసీ (ఓపెన్ కేటగిరి)కి 1, బీసీ-సీకి 1 సీటు అందుబాటులో ఉన్నాయన్నారు. రోస్టర్ కేటగిరి కలిగిన అభ్యర్థులు బైపీసీ చదివినవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## పొలంలో భారీ గుంత

బేతంచెర్ల, సెప్టెంబరు 26: మండలంలోని ఎంబాయి గ్రామానికి చెందిన కరుణాకరప్ప పొలంలో మామిడి చెట్ల మొద్దులు ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తుండగా ఓ పెద్ద గుంత బయటపడింది. ఈ లోతైన గుంత ఉన్న విషయం ఆ నోట ఈ నోట చేరి గ్రామాల ప్రజలకు తెలియడంతో తిలకించేందుకు ప్రజలు బారులుగా తరలివచ్చి తిలకిస్తున్నారు. పొలంలో గుంత ఉండటంతో ఆశ్చర్యంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


మొద్దులు తొలగిస్తుండగా.. పొలంలో కనిపించిన గుంత

## పత్తికొండ, కర్నూలు ఆర్డీఓలు బదిలీ

కర్నూలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ, కర్నూలు ఆర్డీఓలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డిని జీఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. కాగా కర్నూలు ఆర్డీఓగా విజయనగరం జిల్లా బీసీ వెల్ఫేర్ ఈఓగా పనిచేస్తున్న కిడారి సందీప్ కుమార్ బదిలీ అయ్యారు. ఇక పత్తికొండ ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి కూడా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రాజమహేంద్రవరంలో టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.భరత్ నాయక్ నియమితులయ్యారు. కాగా రామలక్ష్మి రేపల్లె ఆర్డీఓగా బదిలీ అయ్యారు.

# శాంతి భద్రతలే లక్ష్యం

- నిజనిర్ధారణ చేసుకుని కేసులు నమోదు చేయాలి
- శాంతి భద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు తీసుకోవాలి
- డీఐజీ కోయ ప్రవీణ్
- ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసా పత్రాలు, రివార్డులు ప్రదానం

కర్నూలు, సెప్టెంబరు 26: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస&లు పనిచేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి డీఐజీ జిల్లాలోని సబ్ డివిజన్ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారిగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో అల్లరిమూకలు, ఫ్యాక్షన్ చరిత్ర కలిగిన వారిపై గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బైండోవర్ చేస్తూ వారి ప్రవర్తనపై భవిష్యత్తులో నిఘా ఉంచాలన్నారు. ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైతే రౌడీషీట్లు నమోదు చేయాలని ఆదేశించారు. రాబరీ, డెకాయిట్ వంటి గ్రేవ్ కేసులపై దర్యాప్తులు పకడ్బందీగా చేయాలని సూచించారు. ప్రాపర్టీ, చీటింగ్, సైబర్ ఫ్రాడ్స్ కేసులలో ఫిర్యాదులు వస్తే వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయించే వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. నాటుసారా తయారు చేసే వారిపై కేసులు నమోదు చేయాలని, సారా బెల్లం అమ్మేవారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. లాంగ్ పెండింగ్ కేసుల గురించి సబ్ డివిజన్ల వారిగా అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసులకు సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులు అందజేశారు.

**ప్రశంసా పత్రాలు, రివార్డులు అందుకున్న వారు:**

● **సీసీఎస్ పోలీసులు:**

కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో కాపర్‌వైర్, ట్రాన్స్‌ఫార్మర్ రికవరీ, ఆయిల్ దొంగతనం కేసులను గుర్తించడంలో జిల్లాలోని ఇతర 23 కేసులలో నిందితులను గుర్తించడంతో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ పోలీసులు సీఐ పి. శేషయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎంవీ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు ఎస్.నాగరాజు, యు.దేవరాజు, జే. శేఖర్.

● **సైబర్ ల్యాబ్ పోలీసులు:**

కాపర్ వైర్ అండ్ ట్రాన్స్‌ఫార్మర్, మొబైల్ రికవరిలో ప్రతిభ కనబరిచిన సైబర్ ల్యాబ్ పోలీసులు సీఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ రాజేశ్వర్ రెడ్డి, చాంద్‌బాషా, దేవనాయుడు, పి. తిరుమలరావు, యు. వెంకట్రాజు, కిరణ్ కుమార్, మహేశ్వర్ సింగ్.

● కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసు ఛేదించడంలో మంచి ప్రతిభ కనబరిచి సీఐ మురళిధర్ రెడ్డి, ఎస్ఐ మన్మధ విజయ్, కానిస్టేబుళ్లు రంగారావు, కిషోర్, వీరేష్, తిరుమలేష్.


సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్, పక్కనే ఎస్పీ జి.బిందుమాధవ్

● **లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో:**

డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐలు, నాగరాజరావు, బి.మధుసూదన్‌గౌడు, రామయ్యనాయుడు.

● వినాయక నిమజ్జనం విధుల్లో ప్రతిభ కనబరిచిన స్పెషల్ బ్రాంచ్ వారికి, కమ్యూనికేషన్ పోలీసులకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఎస్ఐలు, హనుమంతు, వేణుగోపాల్‌రాజు, ఏఎస్ఐలు, మౌలాలి, అజ్మతుల్లా, లక్ష్మీనారాయణ, వీరేంద్ర, ఈశ్వర్ రెడ్డి, అస్లాంబాషా, కమ్యూనికేషన్ సీఐ మనోహర్, హెడ్ కానిస్టేబుల్ పరమేష్.

● డీసీఆర్‌బీ పోలీసులకు జిల్లా క్రైమ్ రికార్డులలో ప్రతిభ కనబరిచిన డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్‌బాబు, పోలీసులు ఫారూఖ్‌బాషా, ఆచారి, బాబా, రామచంద్రుడులకు ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు వెంకట్రామయ్య, శ్రీనివాసరాచారి, సోమన్న, ఉపేంద్రబాబు, శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# జల వనరుల శాఖలో బదిలీలు

- కర్నూలు ఇన్‌చార్జి ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి అనంతపురం జిల్లాకు
- డీఎస్ఈగా బాలచంద్రారెడ్డి నియామకం
- ఈయనకే ఎస్ఈ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చే అవకాశం
- టీబీపీ ఎల్లెల్సీ ఆదోని డివిజన్ ఈఈగా పాండురంగయ్య

కర్నూలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల శాఖలో పని చేస్తున్న ఇంజనీర్లను గురువారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ శాఖ ఈఎన్‌సీ సిఫారసు మేరకు ఈ బదిలీలు చేశారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పని చేస్తున్న పలువురు ఈఈలను ఇతర వివిధ జిల్లాలకు బదిలీ చేసింది. అదే క్రమంలో ఆయా జిల్లాల్లో పని చేస్తున్న ఈఈలను కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. కర్నూలు మైనర్ ఇగిరేషన్ (ఎంఐ) డివిజన్ ఈఈ విధులు నిర్వహిస్తూ కర్నూలు ఇగిరేషన్ సర్కిల్ ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా కొనసాగుతున్న రెడ్డి శేఖర్‌రెడ్డిని అనంతపురం జిల్లా హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎంఐ ఈఈగా శ్రీశైలం ప్రాజెక్టు ఈస్ట్ నిర్వహణ డివిజన్ ఈఈ జి. శ్రీనివాసులను నియమించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కర్నూలు ఐసీ ఎస్ఈ ఇన్‌చార్జి బాధ్యతలు రెడ్డి శేఖర్‌రెడ్డికి ఇవ్వడం కోసం జి. శ్రీనివాసులను బలవంతంగా బదిలీ చేశారు. తాజాగా రెడ్డి శేఖర్‌రెడ్డి బదిలీ కావడం.. అదే స్థానంలోకి జి. శ్రీనివాసులు రావడం ఆ శాఖలో ప్రధానంగా చర్చనీయాంశంగా మారింది.


ఆదోని డివిజన్ ఈఈగా పాండురంగయ్య

● ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా బాలచంద్రారెడ్డి..?:

కర్నూలు జలవనరుల సర్కిల్ ఎస్ఈ అదనపు బాధ్యతలు చూస్తున్న ఎంఐ ఈఈ రెడ్డి శేఖర్‌రెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. కడప జిల్లా ఎంఐ డివిజన్‌లో పని చేస్తున్న బాలచంద్రారెడ్డిని కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా నియమించారు. ఆయనకే ఎస్ఈ ఇన్‌చార్జి (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. అధికారికంగా ఉత్తర్వులు వచ్చే వరకు రెడ్డిశేఖర్‌రెడ్డినే ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగే అవకాశం ఉంది. అలాగే.. పోలవరం ప్రాజెక్టు ధవళేశ్వరం డివిజన్ ఈఈగా పని చేస్తున్న పి. పాండురంగయ్యను తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ ఆదోని డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఎల్లెల్సీ-3 డివిజన్ డీఈఈ శైలేశ్వర్ ఎల్లెల్సీ ఈఈ ఇన్‌చార్జిగా ఉన్నారు.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇరిగేషన్ ఈఈల బదిలీ వివరాలు

| ఈఈ పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| పి. రెడ్డి శేఖర్‌రెడ్డి | ఎంఐ డివిజన్, కర్నూలు | హెచ్చెల్సీ డివిజన్, అనంతపురం జిల్లా |
| జి. శ్రీనివాసులు | శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ డివిజన్ | ఎంఐ డివిజన్, కర్నూలు |
| బి. బాలచంద్రారెడ్డి | ఎంఐ డివిజన్, కడప | డిప్యూటీ ఎస్ఈ, ఇరిగేషన్ సర్కిల్, కర్నూలు |
| పి. పాండురంగయ్య | పోలవరం ప్రాజెక్ట్, ధవళేశ్వరం | టీబీపీ ఎల్లెల్సీ డివిజన్, ఆదోని |
| పి. నాగరాజురావు | ఎస్ఆర్‌బీసీ క్యూసీ డివిజన్-2 నంద్యాల | ఇరిగేషన్ డివిజన్, నిడదవోలు, గోదావరి డెల్టా |
| ప్రతాప్ చిరుతాని | ఐబీ డివిజన్, అనంతపురం | కేసీ కెనాల్ డివిజన్, నంద్యాల |
| కె. మల్లికార్జున | కెడబ్ల్యూ డివిజన్, తెనాలి | శ్రీశైలం ప్రాజెక్టు ఈస్ట్ నిర్వహణ డివిజన్, శ్రీశైలం |
| ఎల్ఎన్ ప్రసాద్ మేడసాని | ఎస్ఆర్‌బీసీ డివిజన్-2, పాణ్యం | డీఎస్ఈ, ఎస్ఆర్‌బీసీ ఎస్ఈ ఆఫీస్ సర్కిల్-2, నంద్యాల |
| బి. రాజేంద్రప్రసాద్ | ఎస్ఆర్‌బీసీ-1, నంద్యాల | ఇరిగేషన్ ప్రాజెక్ట్ సీఈ, కర్నూలు |
| ఎస్. లక్ష్మణ్‌నాయక్ | డీసీఈ, ప్రాజెక్ట్ సీఈ ఆఫీస్, కర్నూలు | శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ ఈస్ట్ డివిజన్, శ్రీశైలం |

## భూసేకరణ, అటవీ క్లియరెన్సులు పూర్తి చేయండి : మంత్రి బీసీ


రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడుతున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 26: నేషనల్ హైవే ప్రాజెక్టుల భూసేకరణ, అటవీ క్లియరెన్సులను గడువు లోపు పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడలోని రోడ్లు, భవనాల శాఖ ఈఎన్‌సీ కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీ సమీక్షా సమావేశం మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం జాతీయ రహదారులకు రూ.58,817 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులకు గాను 2,594 కిలో మీటర్ల రహదారుల పనులు కొనసాగుతున్నాయన్నారు. అయితే వీటిలో 59 ప్రాజెక్టుల భూసేకరణ సమస్యలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ భూములను కాంట్రాక్టు ఏజెన్సీలను అప్పగించడానికి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు అవసరమైన సూచనలను జారీ చేశారు. అటవీ క్లియరెన్సు సమస్యలను కూడా మంత్రి సమీక్షించారు. అటవీ క్లయరెన్సు సమస్యల పరిష్కారానికి కర్నూలు, కడప, ప్రకాశం, సత్యసాయి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మంత్రి మాట్లాడారు. ప్రతి బుధవారం కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నర్వహించి భూసేకరణ క్లియరెన్సుల పురోగతిని సమీక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే, ల్యాడ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ రామచంద్ర, అధికారులు నేషనల్ హైవే అధికారులు రాకేశ్‌కుమార్, ఆర్‌కె సింగ్, శేషుకుమార్, అటవీశాఖ అసిస్టెంట్ కమిషనర్ దీప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వేముగోడు, హెచ్ కైరవాడి గ్రామాల్లో డెంగీ కేసులు

గోనెగండ్ల, సెప్టెంబరు 26: మండల పరిధిలోని వేముగోడు, హెచ్ కైరవాడి గ్రామాలలో ఇద్దరి వ్యక్తులకు డెంగీ సోకినట్లు జిల్లా మలేరియా యూనిట్ అధికారి నూకరాజు తెలిపారు. దీంతో గురువారం గోనెగండ్ల వైద్యాధికారులు, జిల్లా మలేరియా అధికారి నూకరాజు వేముగోడు, హెచ్ కైరవాడి గ్రామాలను చేరుకొని డెంగీ సోకిన వారి ఇళ్లలో దోమలు ప్రబలకుండా మందును పిచికారి చేశారు. అలాగే వీధిలోని వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే వ్యాధిగ్రస్తుల ఇళ్ల పరిసరాలలో దోమలు ప్రబలకుండా ద్రావణం పిచికారి చేయించారు. గ్రామంలోని పలు వీధుల్లో మురుగు నీరు నిలువ ఉన్న ప్రాంతంలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అసుపత్రికి రావాలిని వైద్య సిబ్బంది గ్రామస్థులకు సూచించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఆశా వర్కర్లు వెళ్లి లార్వా పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామంలో మురికినీటి తొలగిస్తున్నపంచాయతీ సిబ్బంది

## బాలికపై అత్యాచారం

● యువకుడిపై కేసు నమోదు

మిడ్తూరు, సెప్టెంబరు 26: బాలికపై అత్యాచారం చేసిన ఓ యువకుడిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. మిడ్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వడ్డె ఎల్ల రాజు అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేశాడు. తల్లి లేకపోవడంతో ఆ బాలిక తన అత్త, పిన్నిల వద్ద ఉంటూ కూలీ పనికి వెళ్లేది. వారం రోజుల నుంచి అనారోగ్యం కారణంగా ఇంటి వద్ద ఉంటోంది. మధ్యాహ్న సమయంలో వడ్డె ఎల్ల రాజు బలవంతంగా బాలికను తీసుకొని వెళ్లి అత్యాచారం చేశాడు. బయట ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. మంగళవారం ఉదయం 11 గంటలకు బాలిక ఇంట్లో ఉండగా బలవంతం చేయబోయాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో బాలిక కేకలు విన్న ఆమె సోదరుడు వచ్చి తలుపులు తోశాడు. రాజు తలుపులు తీసి అతడ్ని తోసి అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

## వీఆర్వో మద్దిలేటి సస్పెన్షన్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26: గతంలో కల్లూరు మండలంలో పని చేసి ప్రస్తుతం దేవనకొండ మండలం తెర్నేకల్-2 గ్రామ వీఆర్వోగా పని చేస్తున్న కే మద్దిలేటిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేశారు.

## 29న రేబిస్ నివారణ దినం

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 26: ఈ నెల 28న లూయిస్ పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రపంచ రేబిస్ నివారణ దినం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ వైద్యాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కుక్కలు, కోతులు వంటి పెంపుడు జంతువులు కరవడం వల్ల రేబీస్ వ్యాధి సోకుతుందన్నారు. ప్రజలు పెంపుడు జంతువుల నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముందస్తు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు.

## ఎమ్మిగనూరు ఆస్పత్రి సూపరింటెండెంట్ సస్పెండ్

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 26: విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో పాటు శిశువు మృతికి కారణమైందంటూ ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయిపై డీసీహెచ్ డాక్టర్ మాధవి సస్పెన్షన్ వేటు వేశారు. గురువారం డీసీహెచ్ మాధవికి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమెపై వచ్చిన అనేక ఆరోపణల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని తేల్చారు. ఈ మేరకు విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే ఆమెస్థానంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుధా అయ్యగారిని నియమించారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని నల్లకాలువ గ్రామానికి చెందిన డానియేలు(48) అనే రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. డానియేలు గ్రామ శివార్లలోని తన మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు గురువారం సాయంత్రం పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో పొలంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందారు.

## టూరిస్ట్ డార్మెటరీ లీజుకు వేలం ప్రకటన

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 26: నంద్యాల జిల్లా పర్యాటక శాఖ ఆధీనంలోని యాగంటి క్షేత్రం వద్ద ఉన్న టూరిస్ట్ డార్మెటరీ లీజుకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణరావు తెలిపారు. అక్టోబరు 1వ తేదీన కలెక్టర్ కార్యాలయంలోని మెదటి అంతస్తులోని ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో బహిరంగ వేలంపాట ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు వివరాలకు ఫోన్ 7995087089, 8297092022 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

## పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

**కల్లూరు, సెప్టెంబరు 26:** టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్ పార్క్‌లోని సచివాలయం సమీపంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే హామీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం చంద్రబాబు అనుభవంతో విపత్తుల్లోనూ సంక్షేమం, అభివృద్ధి దిశగా పని చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మోగా డీఎస్సీ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ పెంపు, అన్న క్యాంటీన్, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, ఉద్యోగులకు ఒకటో తేదినే జీతాల అందించేలా సీఎం చంద్రబాబు ఐదు సంతకాలు చేశారన్నారు. కాలనీలోని పార్క్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాలు ధ్వంసం చేస్తున్నారని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీలు రోడ్లు కావాలని, పార్క్‌లో పెళ్లిల్లకు హాలు ఇవ్వాలని కోరగా అధికారుతో చర్చించి ప్రజల సమ స్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికీ తిరిగి 100 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన విజయాల కరపత్రాన్ని పంపిణీ చేసి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర గొర్రెల పెంపకం మాజీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, బీజేపీ నాయకులు వీరప్ప, జనసేన నాయకులు తిరుమలేసు చిరంజీవి, కార్పొరేటర్ జయరాముడు, శైలజా యాదవ్, వీరేంద్ర, శ్రీనివాస్, ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే దస్తగిరి**

**గూడూరు:** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం గూడూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో వంద రోజులలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజా వేదిక గ్రామ సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా రాష్ట్రాన్ని అభి వృద్ధి పథంలో ముందుకు తీసకెళ్తున్నారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు చంద్రబాబు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జె నయోమీ, టీడీపీ నాయకులు జె సురేష్, గోపాల్ రెడ్డి, కృష్ణ, ఎంపీటీసీ మద్దిలేటి, కర్ణం చిన్న గిడ్డయ్య, బం గారు శ్రీనివాసులు, స్పెషల్ ఆఫీసర్ సబిహా పర్వీన్, తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో విజయ సింహారెడ్డి పాల్గొన్నారు.

**ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యం:** ప్రజలకు మంచి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ మునిస్వామి, మం డల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు అన్నారు. గురువా రం గూడూరు మండలం ఆర్ కానాపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలపై ప్రజావేదిక - గ్రామ సభను నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**ఓర్వకల్లు:** చంద్రబాబుతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల నాయకులు విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని నన్నూరు, పూడిచెర్ల గ్రామాల్లో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. నన్నూరు గ్రామంలో ఎంపీడీవో శివనాగప్రసాద్, పూడిచెర్ల గ్రామంలో ఎంఈవో ఓంకార్ యాదవ్‌లు ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. వంద రోజుల పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుల్లారెడ్డి, తిరుపాలు, ప్రకాశం, శివుడు, రాజన్న, విజయుడు, కాజామియా, సర్కార్, పంచా యతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**సి.బెళగల్:** మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో సర్పంచ్ రామలింగమ్మ, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి, వెంక టేశ్వరగౌడు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామములో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ చంద్రబాబు చేపట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

**కోడుమూరు(రూరల్):** ప్రభుత్వ లక్ష్యం మేరకు స్వర్ణాంధ్ర 2047 దిశగా సాగుదామని మండల ప్రత్యేకాధికారి రంగలక్ష్మీదేవి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని లద్ద గిరి, గోరంట్ల గ్రామాల్లో గురువారం ప్రజావేదిక గ్రామ సభ నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించారు. వందరోజుల పాలనలో ప్రభుత్వ విజయాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత


కె. నాగలాపురంలో స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి


పూడిచెర్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు


లద్దగిరిలో..

## ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చేస్తున్న గౌరు దంపతులు

**కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 26:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో 13వ చిల్డ్రన్ క్యాంప్ గుడ్ న్యూస్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇటువంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. క్యాంప్ డైరెక్టర్ రెవరెండ్ జె.ప్రభుదాస్ మాట్లాడుతూ అక్టోబరు 7, 8, 9 తేదీల్లో కోల్స్ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ కార్యక్ర మాన్ని సండే స్కూలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ అనిల్ నాథ్, విజయ్‌కుమార్, స్వరూప్ పాల్గొన్నారు.

## ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు పురస్కారం



లండన్ బుక్ ఆఫ్ రికార్డుతో ప్రిన్సిపాల్ నాగస్వామినాయక్

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26:** కర్నూలు బిక్యాంపు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్‌కు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పురస్కారం లభించింది. నాగస్వామి నాయక్ విద్యారంగానికి చేస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా పురస్కారాన్ని ఈ నెల 25న మెయిల్ ద్వారా ప్రిన్సిపాల్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ రవినాయక్, డీవీఈవో పరమేశ్వర్ రెడ్డి, ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి, కర్నూలు జిల్లా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల అసోసియేషన్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

## నేడు మాజీ సీఎం కోట్ల వర్ధంతి

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26:** జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ సీఎం కోట్ల విజయ భాస్కరరెడ్డి 23వ వర్ధంతిని శుక్రవారం నిర్వహిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కిసాన్ ఘాట్‌లో కోట్ల సమాధికి నివాళుల ర్పించి, కోట్ల సర్కిల్‌లోని కోట్ల విజయ భాస్కరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తామన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

## సమస్యలుంటే సంప్రదించండి

**సి.బెళగల్, సెప్టెంబరు 26:** రైతులు సమస్యలు ఏమైనా ఉంటే తమను సంప్రదించాలని నూతన తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు భూముల సమస్యలు ఉంటే దళారుల దగ్గరకు వెళ్లకుండా తమను సంప్రదించాలన్నారు. అనంతరం విధుల్లో చేరిన తహసీల్దార్ శ్రీనివాస రెడ్డిని కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

## నాయకల్లు సుంకన్న బాధ్యతల స్వీకరణ

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26:** జిల్లా వృత్తి విద్యా కార్యాలయంలో అకడమిక్ గైడెన్స్ మానిటరింగ్ అధికారిగా డాక్టర్ నాయకల్లు సుంకన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువ య్యశెట్టి, ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, రమణారెడ్డి, కార్యాలయ ఉద్యోగులు సుంకన్నను అభినందించారు.

## కేజీబీవీలో కౌమారుల ఆరోగ్య దినోత్సవం

**కర్నూలు(హస్పిటల్), సెప్టెంబరు 26:** కల్లూరు మండలం లక్ష్మీపురం కేజీబీవీ స్కూల్‌లో ఆర్‌బీఎస్‌కే పీవో ఐ.హేమలత ఆధ్వర్యంలో గురువారం కౌమారుల ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. మంచి స్పర్శ చెడు స్పర్శ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసు పద్మా వతమ్మ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

**సి.బెళగల్, సెప్టెంబరు 26:** కిశోరబాలికలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీవో రాముడు అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. గురువారం సి.బెళగల్‌లోని అంగన్ వాడీ కేం ద్రాలను ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని చింతమానుపల్లె, తిమ్మనదొడ్డి, పలుకుదొడ్డి, మారందొడ్డి, బ్యాడొలి, గొల్లలదొడ్డి గ్రామస్తులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**కర్నూలు, సెప్టెంబరు 26:** పంచలింగాల చెక్‌పోస్టు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని బలరామ్‌గౌడు (27) మృతి చెందాడు. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్ అనే యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. పాతబస్తీకి చెందిన బలరామ్‌గౌడు, రాజ్‌కుమార్ ఇద్దరు స్నేహితులు. వీరిద్దరు తెలంగాణ రాష్ట్రంలోని గద్వాలకు బైక్‌పై వెళ్తుండగా.. వీరి వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బలరామ్‌గౌడు అక్కడికక్కడే మృతి చెందగా.. రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. రాజ్‌కుమార్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వరద బాధితులకు అంగన్‌వాడీల విరాళం


అంగీకార పత్రాన్ని నోడల్ ఆఫీసర్‌కి అందజేస్తున్న జే. లలిత

**కర్నూలు(హస్పిటల్), సెప్టెంబరు 26:** విజయవాడ వరద బాధితులకు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ రూ.లక్ష విరాళాన్ని స్త్రీశిశు సంక్షేమ శాఖ నోడల్ ఆఫీసర్ పద్మినికి అందజేశారు. జిల్లా లోని అంగన్‌వాడీలు రూ.60వేలు, హెల్పర్స్ రూ.40వేలు సీఎం రీలిఫ్ ఫండ్‌కు జమ చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ), ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రెండు సంఘాలు ఒకే నిర్ణ యాన్ని తీసుకున్నారు. ఈ నెల గౌరవ వేతనం నుంచి కట్ చేయా లని నోడల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలిత, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, అంగన్‌వాడీ నాయకులు దుర్గా పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి యువజనోత్సవం, సాంస్కృతిక పోటీలు

**కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 26:** జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో గురువారం స్థానిక సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవం, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, పి.దీప్తి, సెట్కూరు సీఈవో పీవీ రమణ, రిటైర్డ్ సీఈవో పి.సోమశి వారెడ్డి, ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, డా.ఎం. ఫామీదా బేగం, డా.ఎం.హరికిషన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జానపద నృత్యాలు, గీతాలాపనలు, చిత్ర లేఖనం, పోయేట్రీ, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ కింద ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో దాదాపు 52 ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాల, పాఠశాలల విద్యార్థులు పాల్గొని పలు ఆవిష్కరణలు ప్రదర్శించారు. అనంతరం విజేతలకు అతిథులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.


విజేతలతో అతిథులు

## స్వర్ణాంధ్రప్రదేశ్‌పై రైతులతో సమావేశం


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీనివాస్

**కర్నూలు(రూరల్), సెప్టెంబరు 26:** కర్నూలు రూరల్ మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో గురువారం స్వర్ణాంధ్రప్రదేశ్‌పై రైతులు, మత్స్యకారులతో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు పండించే పంటలు, పశుపోషణ వంటి జీవన విధానంపై మార్పులు ఏవిధంగా ఉంటాయే వివరించారు. మత్స్యకారులు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాల ద్వారా ఏవిధంగా లబ్ధి పొందుతున్నారని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈసమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అనూరాధ, ఏఎస్‌వో శివకుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26:** విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని డాక్టర్ షాషావలి అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం కేవీఆర్ ప్రభుత్వ బాలి కల జూనియర్ కళాశా లలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిచారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.లాలెప్ప, సీనియర్ లెక్చరర్ ప్రభుచరణ్, హిమబిందు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రేష్మా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు నోట్ బుక్స్ వితరణ

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26:** కర్నూలు జిల్లా రజక విద్యాసేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కింగ్ మార్కెట్ సమీపం లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు సమితి నాయకులు నోట్‌బుక్స్‌ను వితరణగా ఇచ్చారు. చాకలి ఐలమ్మ జయంతిని పుర స్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీ వెంకటేశ్, రాయలసీమ రజక సాధికార కమిటీ కన్వీనర్ హెచ్.లింగమయ్య తెలిపారు. నాయకులు శంకరన్న, లీగల్ అడ్వైజర్ జగదీష్‌బాబు, కమిటీ జిల్లా కన్వీనర్ రేణుకమ్మ, రాధమ్మ, చంద్రకళ, మమత, చిత్తారిగేరి రమణ పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**గూడూరు సెప్టెంబరు 26:** కె.నాగలాపరం సుంకులాపరమేశ్వరి అమ్మవారిని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గురువారం దర్శించుకున్నారు. మండలంలోని కె.నాగలాపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ ఈవో నరసయ్య ఆధ్వర్యంలో పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి, సురేష్, శ్రీనివా సులు, ఆలయ సిబ్బంది కేశవ ఉన్నారు.

## నాణ్యమైన భోజనం అందించండి

**ఓర్వకల్లు, సెప్టెంబరు 26:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని పూడిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశా లలను ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజన పథకాన్ని, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి పుస్తకాలు విరాళం

**కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 26:** జిల్లా కేంద్ర గ్రంథాల యానికి కర్నూలుకు చెందిన దీప్తి యాడ్స్ కుమార్ పుస్తకాలు విరాళంగా అందజేశారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఐటీ, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన రూ.20వేలు విలువ చేసే పుస్తకాలు ఆయన సంస్థ కార్యదర్శి కే.ప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, వజ్రాల గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఐలమ్మ

**కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 26:** అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఐలమ్మ అని ఏపీ రజక వృత్తిదారుల సంఘం ప్రతినిధి శేషాద్రి అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ నిజాం ప్రభువుల ఆరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన వీరవనిత ఐలమ్మ అని, నేటి తరాలు ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాయిబాబా, రాముడు, కమిటీ సభ్యులు జయమ్మ, మద్దిలేటి, కర్రెన్న తదితరులు పాల్గొన్నారు.

## కంటి ఆపరేషన్‌కు రూ.1.50 లక్షల సాయం

### గౌరు కుటుంబానికి టీడీపీ కార్యకర్త కృతజ్ఞతలు


గౌరు జనార్దన్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బాధితుడు మధు

**ఓర్వకల్లు, సెప్టెంబరు 26:** మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మధు కంటి చూపు కోల్పోవడంతో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తనయుడు టీడీపీ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి కంటి ఆపరేషన్ చేయించి వెలుగులు నింపారు. గురువారం గౌరు జనార్దన్ రెడ్డికి బాధితుడు మధు, టీడీపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. గత ఎన్నికల సమయంలో గ్రామానికి గౌరు చరిత ప్రచారానికి రావడంతో కుటుంబ సభ్యులు తన కుమారుడుకు రెండు కళ్లు కనిపించడం లేదని, వైద్యపరీక్షలు చేయాలని కోరగా.. స్పందించిన ఎమ్మెల్యే తనయుడు గౌరు జనార్దన్ రెడ్డి రూ.1.50 లక్షలు ఖర్చు చేసి కంటి పరీక్ష చేయించి వెలుగులు నింపారని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పరమేశ్వరరెడ్డి, పెద్ద గిడ్డయ్య, కర్రెన్నగౌడు, మహేష్ పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 26:** గత 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న క్లాప్ డ్రైవర్ల వేతనాలను చెల్లించాలని సీఐటీయూ నగర కార్యదర్శి విజయ్ రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం నగర పాలక కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి ఆయన మాట్లాడారు. స్టాండింగ్ కమిటీలో బకాయి వేతనాలు 4 నెలలు చెల్లించాలని తీర్మానించినా ఇంతవరకు అతీగతీ లేదన్నారు. నాయకుడు కుమార్ పాల్గొన్నారు.

## నిందితులను శిక్షించాలి

**కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 26:** తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించిన వారిపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ కేంద్రీయ కార్యకార్త యెక్కలి రాఘవులు అన్నారు. గురువారం నగరంలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, టీసీ మద్దిలేటి, నీలి నరసింహ, సందడి మహేష్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఏవోగా విజయశ్రీ




**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26:** డీఆర్వో కార్యాలయంలోని కలెక్టరేట్ ఏవోగా విజయశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె సి. బెళగల్ తహసీల్దాగా పని చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న ఏవో రాజేశ్వరిని డీఆర్వో కార్యాలయంలో ఒక శాఖకు సూపరింటెండెంట్‌గా నియమించారు. అదేవిధంగా ఓర్వకల్లు ఆర్ఐగా పని చేస్తున్న అధికారి, మరొక సిబ్బంది బదిలీ అయ్యారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26:** జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామని డీసీసీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆదోని నియోజకవర్గం సమన్వయకర్త జి.రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదోని నియోజక వర్గం అమరావతి నగర్. చిన్న పెండేకల్లు నుంచి రాజగోపాల్‌రావు, 50 మంది అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధకర్‌బాబు, పీజీ నరసింహులు యాదవ్, ఎం కాశీం వలి, మురళీకృష్ణంరాజు, ఎస్ ప్రమీల పాల్గొన్నారు.

## మండల అభివృద్ధిపై సమావేశం



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్యామల

**సి.బెళగల్, సెప్టెంబరు 26:** మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన గురువారం మండల అభివృద్ధిపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, టీడీపీ నాయకులతో ప్రత్యేక అధికారి శ్యామల సమావేశం నిర్వహించారు. గ్రామాలలో రోడ్లు, తాగునీరు, పాఠశాలలకు అదనపు తరగతి గదులు తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, బాలాజీ వెంకటేష్, రాజు, గౌడు, జిక్రియ పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలి


కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26:** నగరంలోని పాతబస్తీలోని గడియారం ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలని, డాక్టర్, నర్సులు, సిబ్బందిని నియమించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం రాజశేఖర్ కోరారు. గురువారం నగర పాలక సంస్థ కమిషనర్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లా డుతూ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ ఆస్పత్రికి నగరంలోని ఖండేరీ, బండిమెట్ట, పూలబజార్, ఛత్రీబాగ్, ఖడక్ పూర, ఎర్రబురుజు, ఖిల్ల వీధుల్లోని ప్రజలు ఆశ్రయిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎండీ షరీఫ్, రామకృష్ణ, అబ్దుల్ దేశా య్, మహబూబ్‌బాషా, కుమార్ పాల్గొన్నారు.

## కర్నూలు టౌన్ ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసర్‌గా చంద్రబోస్


చంద్ర బోస్‌ను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

**కల్లూరు, సెప్టెంబరు 26:** విద్యుత్‌శాఖ కర్నూలు టౌన్ డివిజన్ ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసర్‌గా (ఏఏఓ) ఎస్.జే. చంద్రబోస్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2024-25 జనరల్ బదిలీల్లో ఆయన ఎమ్మిగనూరు నుంచి కర్నూలు టౌన్ డివిజన్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఆర్వో బి.మల్లికార్జున ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యారు. కర్నూలు డివిజన్‌లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన చంద్రబోస్‌రావును పలువురు విద్యుత్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

## క్రీడాకారులకు ఏకాగ్రత అవసరం

**కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 26:** రైఫిల్ షూటింగ్ క్రీడాకారులకు ఏకాగ్రత అవసరమని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు అన్నారు. గురువారం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అకాడమిలో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలిక ఎంపిక పోటీల్లో ఆయన పాల్గొన్నారు.

- స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-19 బాలబాలికలకు ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలను డీవీఈవో పరమేశ్వరరెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో హర్షవర్ధన్, రామాంజనేయులు, పీడీలు పాల్గొన్నారు.
- రగ్బీ విజేతలు కంబలపాడు, లక్ష్మీపురం జట్లు: ఆదర్శ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం జిల్లా స్థాయి జూని యర్ కళాశాలల బాలికల రగ్బీ పోటీలు ముగిసాయి. ఈ పోటీల్లో కంబలపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల విజేతగా నిలి చింది. లక్ష్మీపురం కేజీబీవీ జూనియర్ కళాశాల జట్టు రన్నర్ స్థానం లో నిలిచి ట్రోఫీలను కైవసం చేసుకుంది. అతిథులు హర్షవర్ధన్, రామాంజనేయులు పాల్గొని ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పీడీ మహబూబ్ సుబాని, అధ్యాపకులు పాల్గొన్నారు.
- ఆర్.కొంతలపాడు పాఠశాల విద్యార్థులు ఎస్.శివవాణి, కే.లీలా వతి, కే.రాణి, ఆర్.మహేష్క, కే.అజయ్, ఆర్.రామ్‌చరణ్‌లు బాస్కె ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి వారిని అభినందించారు.
- స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-14, 17 బాలబాలికల విభాగంలో గురువారం జరిగిన అథ్లెటిక్స్ స్విమ్మింగ్ మాడ్రన్ పెంటాతలన్, షూటింగ్, స్కేటింగ్ క్రీడాంశాలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో విజయకుమార్, డీఎస్‌డీవో భూపతిరావు హాజరై క్రీడాకారులకు పలు సూచనలు చేశారు.

## విద్యుత్ చౌర్యం కేసు నమోదు

**కల్లూరు, సెప్టెంబరు 26:** సి.క్యాంప్ సమీపంలో విద్యుత్‌శాఖ అధికారులు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఓ కాంట్రాక్టర్‌పై విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేశారు. ఒక భవనం నిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ అక్రమ విద్యుత్ వినియోగిస్తున్నారనే ఫిర్యాదు అందుకున్న (డీపీఓ విభాగం) ఈఈ ప్రదీప్‌కుమార్ గురువారం తనిఖీ చేసి రూ.లక్ష జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం నేరమని విద్యుత్‌శాఖ నష్టం కలిగిస్తే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు శోభన్ ప్రసాద్, విజిలెన్స్ అధికారులు, ఆపరేషన్ ఏఈ, ఏడీఈ పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు ఆహ్వానం

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26:** గద్వాల జిల్లాలో ఉన్న ఐదో శక్తి పీఠం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషాకు ఆలయ ఈవో పురేంధర్ కుమార్ ఆహ్వాన పత్రికను అందజేశారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కల్లూరు, సెప్టెంబరు 26:** నూతన విద్యుత్ లైన్ నిర్మాణంలో భాగంగా నగరంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు రూరల్ ఏడీఈ సుబ్బన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గూడూరు సబ్ స్టేషన్ పరిధి నగర శివార్లలో కరెంట్ సరఫరా ఉండదన్నారు. మిస్టర్ ఇడ్లీ హోటల్ వెనుక ఇండస్ ఫీడర్ పరిధిలోని అంబేడ్కర్ నగర్, గోగ్యాస్, దివ్యా హోటల్, నవత ట్రాన్స్‌పోర్టు, డీఆర్ఆర్ రెడీ మిక్సర్ పరిశ్రమలకు త్రీఫేస్ సప్లైలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు.

## గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

మద్దికెర, సెప్టెంబరు 26: లబ్ధిదారులు అక్టోబరు చివరినాటికల్లా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్, పీఆర్ ఏఈ విష్ణు సూచించారు. గురువారం హౌసింగ్ కార్యాలయంలో మాట్లాడుతూ స్లాబ్ లెవెల్ కట్టినవారు అక్టోబరు 30 నాటికి బేస్‌లెవెల్‌లో నిర్మించినవారు మార్చి 2025కు పూర్తి చేసుకోవాలన్నారు.

## జాతీయ స్థాయి క్రీడాకారుడికి సన్మానం



మధును సన్మానిస్తున్న తిక్కారెడ్డి, వీరభద్రగౌడ్

ఆలూరు, సెప్టెంబరు 26: చైనాలో బీచ్ సెపక్ తక్రా పోటీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆలూరుకు చెందిన మధును టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, వీరభద్ర గౌడ్ గురువారం సన్మానించారు. గ్రామీణ ప్రాంతం నుంచి చైనాలో జరిగిన క్రీడల్లో పాల్గొని పథకం సాధించడం హర్షణీయమన్నారు. కన్వీనర్ అశోక్ యాదవ్, నాయకులు వన్నూర్ వల్లి, నెమేకల్ రవి, గోవింద్, బెలగంటి హనుమప్ప, రాము యాదవ్, బంగారు రామకృష్ణ పాల్గొన్నారు.

## ముగిసిన దశమి వేడుకలు

గోనెగండ్ల, సెప్టెంబరు 26: చింతలాముని, నల్లారెడ్డి దశమి ఉత్సవాలు గురువారం ఆరాధనోత్సవాలతో ముగిశాయి. 22వ తేదీ నుంచి 27వ దశమి నిర్వహించారు. చివరి రోజు ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించి పూజలు, ఆకుపూజ, మహామంగళహారతి, నైవేద్య సమర్పణ చేశారు. అనంతరం పల్లకిలో ఊరేగించారు. రాత్రి స్వామి భక్తి గీతాలతో కూడిన భజన నిర్వహించి అన్నదానం నిర్వహించారు.

## కారు, ట్రాక్టర్ ఢీ

పత్తికొండ, సెప్టెంబరు, 26: బైపాస్‌లో గురువారం మధ్యాహ్నం కారు, ట్రాక్టర్ ఢీ కొన్నాయి. బెంగళూరుకు చెందిన కుటుంబం మంత్రాలయానికి వచ్చి, తిరిగి బెంగుళూరు వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలి


ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 26: దొడ్డనకేరి నుంచి పత్తికొండ రూట్‌లలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ కోరారు. గురువారం విద్యార్థులతో కలిసి ఆర్టీసీ డీపో వద్ద ఆందోళన చేపట్టారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు రావడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. డీఎం షఫీకి వినతిపత్రం అందజేశారు. రాజు, కేశవ, గోవిందు, గౌస్, బాషా, అర్జున్ పాల్గొన్నారు.

## రూ.85 వేల ఆర్థిక సాయం


చెక్కు ఇస్తున్న రేణుకమ్మ

ఆలూరు, సెప్టెంబరు 26: హాలహర్వి మండల గూళ్యం గ్రామానికి చెందిన ఖాసీం సాబ్, షేకమ్మ మృతి చెందడంతో పిల్లలు అనాథలుగా మారారు. దీంతో మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం సతీమణి రేణుకమ్మ రూ.85 వేలు గురువారం వారికి అందించారు. నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు మస్తాన్ వల్లి, సాయిబేష్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

## నవ రాత్రులను ఘనంగా నిర్వహిస్తాం

ఆదోని టౌన్, సెప్టెంబరు 26 : నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ సమితి అధ్యక్షుడు కునిగిరి నాగరాజు అన్నారు. గురువారం మునిసిపల్ మైదానంలోని జమ్మిచెట్టు ఆలయ ప్రాంగణంలో ఉత్సవ సమితి సభ్యులు చర్చలు జరిపారు. శ్రీనివాస రెడ్డి, దిలీప్ ధోకా, బసవరాజ్ స్వామి, మారుతి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## విద్యుత్ కార్యాలయంలో చోరీ

ఆదోని, సెప్టెంబరు 26: పట్టణంలోని డీ2 విద్యుత్ కార్యాలయంలో కాపర్ తీగలను దొంగలించారు. గతంలో కూడా చోరీ చోటుచేసుకున్నా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఉండిపోయారని ఆరోపణలు ఉన్నాయి. ఏడీఈ పురుషోత్తమను వివరణ కోరగా ఇద్దరు ఉద్యోగులపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 26: విద్యుదాఘాతంతో యువకుడు మోహిన్(21) గురువారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. నూతనంగా ఏర్పాటుచేసిన బ్యాంకు లైటింగ్ బోర్డును ఏర్పాటు చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై, కిందపడ్డాడు. స్థానికులు గమనించి ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే యువకుడి మృతి చెందినట్లు వైద్యులు ధృవికరించారు. పోలీసులు కేసు మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక..

పత్తికొండ, సెప్టెంబరు, 26: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి విజయ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హచ్‌ఎం మాలతి తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు గుంటూరులో రాష్ట్రస్థాయి పోటీలలో విజయ్ పాల్గొంటారని తెలిపారు.

## జిల్లా స్థాయికి ఎంపిక

హొళగుంద, సెప్టెంబరు 26: జిల్లా స్థాయిక్రీడా పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు నేతాజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, హెచ్‌ఎం గోపినాథ్ తెలిపారు. అండర్ 14 కబడ్డీ బాలికల విభాగంలో అపూర్వ, బాలురు విభాగంలో హరికృష్ణ, కే భరత్ కుమార్ ఎంపిక అవ్వగా, డిస్కు త్రో విభాగంలో పీ రాజాసాబ్ ఎన్నికైనట్లు తెలిపారు.

## ఆర్టీసీ డిపోలో స్వచ్ఛత సేవా

ఎమ్మిగనూరు టౌన్,సెప్టెంబరు 26: స్థానిక ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే బీవీ నాటిన మొక్కలు నీరు పోశారు. డీఎం, ఉద్యోగులు శ్రమదానం చేశారు.ఈ కార్యక్రమంలో ముస్తాక్, ఎల్లప్ప, రఫిక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించొద్దు

గోనెగండ్ల, సెప్టెంబరు 26: ఆట్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించొద్దని సీఐ గంగాధర్ హెచ్చరించారు. గురువారం గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేశారు. పిల్లిగుండ్ల, నెరుడుప్పల, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు, గాజులదిన్నె గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేసి, కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూసుకోవాలని సూచించారు.

## నులి పురుగులను నలిపేద్దాం

మద్దికెర, సెప్టెంబరు 26: నులిపురుగులను నలిపేద్దామని ఏఎన్‌ఎం గాయత్రి పిలుపు నిచ్చారు. ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి ఆదేశాల మేరకు ఎం.అగ్రహారం గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు.

# మండలాన్ని అభివృద్ధి చేస్తాం: ఎంపీ

కోసిగిలో ఎంపీ నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ


కోసిగిలో ఎంపీ నాగరాజును సన్మానిస్తున్న నాయకులు


ఎమ్మిగనూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

కోసిగి, సెప్టెంబరు 26: కోసిగి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ నాయకుడు ఎన్. రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం కోసిగిలో సర్పంచ్ అయ్యమ్మ, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. ఎంపీ మాట్లాడుతూ కోసిగి అక్షరాస్యత, అభివృద్ధి వెనుకబడిందని, స్థానిక ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచులను గెలిపించాలని కోరారు. అనంతరం మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పరిశీలించి ప్రిన్సిపాళ్లను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. డీఈవో శామ్యూల్, తహసీల్దార్ నిత్యానంద రాజు, జనసేన ఇన్‌చార్జి వాల్మీకి లక్ష్మన్న, బీజేపీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ రాముడు, రాకేష్, నాడిగేని అయ్యన్న, తాయన్న, జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీలు తోవి రామకృష్ణ, వెంకటేశ్, చింతలగేని నర్సారెడ్డి, వక్రాణి వెంకటేశ్ పాల్గొన్నారు.

**అంగవైకల్యం ఉన్నా పింఛన్ ఇవ్వని వైసీపీ..**

9వ వార్డు ఎన్టీఆర్ కాలనీకి చెందిన కుమ్మరి కోసిగయ్య కుమారుడు కుమ్మరి మల్లికార్జున (13) తనకు వంద శాతం అంగవైకల్యం ఉన్నా వైసీపీ ప్రభుత్వం పింఛన్ ఇవ్వలేదని ఎంపీకి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన


పింఛన్ కోసం దివ్యాంగుడి వినతి

నాయకులు కలెక్టర్‌తో మాట్లాడి పింఛన్ అందేలా చేస్తామని టీడీపీ నాయకులు భరోసా ఇచ్చారు. మోడల్ స్కూల్, హాస్టల్ భవనాలు శిథిలమైపోయాయని తెలుసుకున్న ఎంపీ వాటిని పరిశీలించారు. డీఈవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామనీ హామీ ఇచ్చారు. పెచ్చులూడిన తరగతి గదుల్లోకి విద్యార్థులను పంపవద్దని ప్రిన్సిపాల్ సమీరారెడ్డికి సూచించారు.

**మంత్రాలయం:** నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, ఎంపీ నాగరాజు అన్నారు. గురువారం కల్లుదేవకుంటలో కురువ సంఘం నాయకులు ఎంపీని సన్మానించారు. రాగన్న, బీమయ్య, గోపాల్, మల్లయ్య పాల్గొన్నారు.

**ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం: ఎమ్మెల్యే బీవీ**

**ఎమ్మిగనూరు:** ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని లక్ష్మీపేటలో ఇది మంచి ప్రభుత్వం ఎందుకంటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల అమలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది మహిళలు తాగునీరు రావడంలేదని, పారిశుధ్య సమస్య ఉందనడంతో జీడీపీ నుంచి పైపులైన్ ఏర్పాటు చేసేందుకు రూ.146 కోట్ల స్కీంను తీసుకు వచ్చామన్నారు. వీధికుక్కల బెడద ఉందని తెలపడంతో అక్కడే ఉన్న కమిషనర్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ గంగిరెడ్డి, షాబీర్, మహేంద్రబాబు, మున్నా, రామకృష్ణనాయుడు, దేవేంద్ర, కౌన్సిలర్ అమాన్, మహేష్‌బాబు, అజాం, గంగాధర్ పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరు టౌన్:** పట్టణంలోని లక్ష్మీపేట, సంజీవనగర్, మాలగెరి, ఎల్లమ్మబీడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ గంగిరెడ్డి, నజీర్, షాబీర్, మధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**తుగ్గలి:** టీడీపీతోనే బీసీలు అభివృద్ధి చెందుతారనీ ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపాల్‌నాయుడు, నాయకులు ఈశ్వర్ రెడ్డి, చక్రపాణి అన్నారు. గురువారం పగిడిరాయి, కొత్తూరులో ఇది మంచి ప్రభుత్వం


ఆస్పరి: చిన్నహోత్సూరులో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

నిర్వహించారు. వెంకట్రాముడు చౌదరి, రమేష్, గుండమయ్య, ప్రభాకర్‌రెడ్డి, రాము, ప్రసాద్, రంగస్వామి, నాగార్జున, సుంకయ్య పాల్గొన్నారు.

**ఆస్పరి:** రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకులు కొంక మధు, మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు, నారాయణ అన్నారు. చిన్నహోతూర్ బినిగేర, జోహరాపురం, గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు, కళ్యాణ్, ఈరన్న, రంగుడు, కోటప్ప, గుండాల కృష్ణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎంఈవో రంగస్వామి

మద్దికెర, సెప్టెంబరు 26: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి అన్నారు. ఎరవలి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడని తెలిపారు. రాజేశ్వర్ చౌదరి, మాజీ సర్పంచ్ వెంకటవర్మ, ఎంఈవో రంగస్వామి, ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి టీడీపీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నరసింహులు గౌడు, మెడికల్ తిమ్మప్ప, మెడికల్ రాము, పులిశేఖర్, నరసింహులు, మునిరంగ స్వామి, కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

## ప్లాటినం జూబ్లీ వేడుకలు వాయిదా

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 26: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్లాటీనం జూబ్లీ ఉత్సవాలు వాయిదా వేసినట్లు కమిటీ సభ్యులు మాచాని శివకుమార్, ప్రకాష్‌జైన్, మాచాని వెంకటేష్, బైలుప్పల షఫీఉల్లా తెలిపారు. గురువారం మాట్లాడుతూ పాఠశాల, జూనియర్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు 29న నిర్వహించాలనుకున్నా, అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. గణేష్, వీరన్నగౌడు, నటరాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## లడ్డూ ప్రసాదాన్ని భ్రష్టు పట్టించారు

మంత్రాలయం, సెప్టెంబరు 26: టీటీడీ లడ్డూ ప్రసాదాన్ని భ్రష్టు పట్టించారని మంత్రాలయం విరాట్ హిందూ పరిషత్ సంఘం నాయకులు హనుమంతు, మాదప్ప, రామాంజనేయులు అన్నారు. గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి రాఘవేంద్ర సర్కిల్‌లో మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశార,ు. అనంతరం తహసీల్దార్ రవికి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో విరాట్ హిందూ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## విప్లవ నారి ఐలమ్మ

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 26: తెలంగాణ సాయుధ పోరాటంలో దొరలను, గడగడలాడించిన విప్లవనారీ చాకలి ఐలమ్మ అని రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీసీ రంగన్న అన్నారు. గురువారం చాకలివీధిలో ఐలమ్మ 129వ జయంతి నిర్వహిం చారు. బాలరంగస్వామి, లచ్చప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

**హొళగుంద:** తొలి భూ పోరాటానికి నాందీ పలికిన వీర వనిత చాకలి ఐలమ్మ అని రజక సంఘం నాయకులు నాగరాజు, లక్ష్మన్న, మల్లికార్జున, చాకలి నాగరాజు గురువారం అన్నారు. మడివాల మాచ్చయ్య గుడి ఆవరణలో 129వ జయంతి నిర్వహించారు. కరెంటు మల్లి, యశ్వంత్, వీరన్న పాల్గొన్నారు.

## ఇంటింటికి కొళాయి

తుగ్గలి, సెప్టెంబరు 26: ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని టీడీపీ నాయకుడు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి అన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో గురువారం పగిడిరాయి కొత్తూరులో రూ.23 లక్షలతో పైపులైన్‌తో పాటు ఇంటింటికి కొళాయి వేయడానికి భూమి పూజ చేశారు. నాగార్జున, లక్ష్మీకాంతరెడ్డి, మద్దిలేటి, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆదుకోవాలి

పెద్దకడుబూరు, సెప్టెంబరు26: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన శాంతిరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. గురువారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. కలెక్టర్, సబ్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించాలని ప్రభుత్వానికి నివేదిక పంపి నష్టపరిహారం వచ్చేలా చూడాలన్నారు.

హనుమన్న, రత్నం,అనిల్ కూమార్, మారెన్న, నందవరం జడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, రవి కుమార్, దుబ్బన్న, బుజ్జప్ప, సంసోను పాల్గొన్నారు. సీపీఎం నాయకులు పరమేష్, తిక్కన్న, ఈరన్న రూ.25వేలు ఆర్థిక సాయం చేశారు.

## ఎస్‌బీ ఎస్‌ఐకి రివార్డు



ఎస్‌ఐకి రివార్డు అందజేస్తున్న ఎస్పీ

మంత్రాలయం, సెప్టెంబరు 26: మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజుకు ఎస్పీ రివార్డు అందజేశారు. గురువారం కర్నూలులో నిర్వహించిన నేర నియంత్రణ సమావేశం ప్రశంసాపత్రాన్ని ఎస్పీ బిందుమాధవ్ అందజేశారు.

## ఎస్‌బీ కానిస్టేబుల్‌కు రివార్డు



రివార్డు అందుకుంటున్న వీరేంద్ర

పత్తికొండ, సెప్టెంబరు 26: ఎస్‌బీ కానిస్టేబుల్ వీరేంద్రకు ఎస్పీ బిందుమాధవ్ నగదు పురస్కారం, ప్రశంసా పత్రాన్ని ఎస్పీ అందజేశారు. గత నెల పత్తికొండ మండలం హోసూరులో టీడీపీ నాయకుడు వాకిటి శ్రీను హత్యకేసులో ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ చూపడంతో అందజేశారు.

## గుడిలో 24 కిలోల గంట చోరీ

మంత్రాలయం, సెప్టెంబరు 26: మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో బీరప్పగుడి ద్వారం వద్ద ఉన్న 24 కిలోల కంచుగంట చోరీకి గురైంది. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి గంటను చోరీ చేసినట్లు పూజారి యాదగిరప్ప, మాజీ సర్పంచ్ అల్లింగప్ప, గాదెలింగప్పం మాదవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుడి గంట చోరీ గురికి కావడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఫిర్యాదు స్వీకరించిన మాధవరం పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. దొంగలను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

## 15 నుంచి శనగ సాగు చేయాలి


డ్రోన్‌తో పిచికారీ విధానాన్ని వివరిస్తున్న శాస్త్రవేత్త

గోనెగండ్ల, సెప్టెంబరు 26: రైతులు శనగను అక్టోబరు 15 నుంచి నవంబరు 15లోపు సాగు చేసుకోవాలని డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ సుజాత సూచించారు. వేముగోడు గ్రామంలో ఎన్‌జీఆర్‌పీ ఎరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం శనగరైతులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. శనగ విత్తే ముందు విటావాక్స్ పవర్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. కలుపు మొలకెత్త కుండా విత్తిన 48 గంటల్లోపు పెండిమి తాలిన్ మందును పిచికారీ చేసుకోవాలని అన్నారు. వెర్రి తెగులు ఆశించిన మొక్కలను తొలగించాలన్నారు. వరిలో అగ్గితెగులు నివారణకు వెస్ప్రాదీ యల్ 300 మిలీ. మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. డ్రోన్‌తో పురుగు మందులను పిచికారీ చేసే విధా నాన్ని చూపించారు. ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత, జాకీర్, లక్ష్మన్న పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరు రూరల్:** బనవాసి కేవీకేలో గురువారం రైతులకు మిరప సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కేవీకే సమన్వయ కర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, ఏడీఏ వెంకటేశ్వర్లు, డీఆర్‌సీ వర్షప్రసాద్ ఏవో శశిధర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు మౌనిక, చందన, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మండలాలు, గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మంత్రాలయం, సెప్టెంబరు 26: గ్రామాల్లో అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం రాత్రి మంత్రాలయం ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభావతి దేవి, తహసీల్దార్ రవి అధ్యక్షత అధికారులతో సమావేశం నిర్వహించారు. తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, రోడ్లు, విద్య, వైద్యం, శిశు సంక్షేమం, పౌరసరఫరా, గ్రామాల్లో గృహ నిర్మాణాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో సాధించాల్సిన ప్రగతి, పనులపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఏవో జీరగణేష్, పీఆర్ ఏఈఈ నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేదస్వరూప, వైద్యాధికారులు సురేష్, అశోక్ కుమార్, ఏపీవో తిమ్మారెడ్డి, ఈసీ శ్రీనివాసులు, రామయ్య, ఆనంద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మీబాయి, నాగలక్ష్మి, ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న పాల్గొన్నారు.

## పథకాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

దేవనకొండ, సెప్టెంబర్ 26: కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి డిమాండ్ చేశారు. గురువారం దేవనకొండ వద్ద విలేకర్లతో మాట్లాడారు. తిరుమల లడ్డూపై కూటమి సర్కారు ఆరోపణలు చేయడం దుర్మార్గమని అన్నారు. పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేయడానికే ప్రతిపక్ష వైసీపీపై కూటమి ప్రభుత్వం లేనిపోని నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ఏడాది చివరిలోగా పథకాలు అమలు చేయకపోతే ప్రజలలోకి వెళ్లి ఉద్యమాలు చేస్తామని హెచ్చరిం చారు. కన్వీనర్ శ్రీనివాసులునాయుడు, కొత్తపేట బాబు, దివాకర్ నాయుడు, లూముంబా, రాజన్న, సోమశేఖర్ రెడ్డి, తిరుమలేష్, చంద్రన్న పాల్గొన్నారు.

## సిబ్బందితో అంగన్‌వాడీల వాగ్వాదం

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 26: తమకు సామాజిక పింఛన్లను ఎందుకు నిలుపుదల చేశారంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంపీడీవో, సచివాలయ సిబ్బందితో గురువారం వాగ్వాదానికి దిగానేజ మండలంలోని కడిమెట్ల-1, కడిమెట్ల-3, టీఎస్ కూలూరు గ్రామాల అంగన్‌వాడీ టీచర్లకు కొన్నేళ్లుగా వితంతు, దివ్యాంగ పింఛన్లు అందుతున్నాయి. అయితే ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మూడు నెలల నుంచి నిలిపివేశారు. అప్పటి నుంచే తామూ పింఛన్లు ఇవ్వాలని అడిగామని అంగన్‌వాడీ టీచర్లు గ్రీషమ్మ, పొగాకుల మెహరూన్‌బీ, సప్పోగు మల్లేశ్వరి అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి అధికారులను నిలదీశారు. ఎంపీపీ కేశన్న, ఎంపీడీవో బంగారమ్మ వచ్చేనెల నుంచి అందేలా చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం

## మంత్రాలయంలో వైభవంగా ఊంజల సేవ

మంత్రాలయం, సెప్టెంబరు 26: మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులకు వైభవంగా ఊంజలసేవ చేశారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వివిధ రథాల పై వజ్రాలు పొదిగిన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

### రాఘవేంద్రుని సన్నిధిలో

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నాటకరాష్ట్ర షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ చైర్మెన్ నరేంద్ర స్వామి, కర్నాటక ఎమ్మెల్సీలు అబ్బయ్య ప్రసాద్, దుర్యోధన మహలింగప్ప గురువారం మంత్రాలయానికి వచ్చారు. శ్రీమఠం ముఖ ద్వారం వద్ద మేనేజర్ వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్‌లు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. జయతీర్థ ఆచార్, వ్యాసరాజార్ పాల్గొన్నారు.

## పట్టుదలతో చదవండి

మద్దికెర, సెప్టెంబరు 26: విద్యార్థులు పట్టుదలతో చదవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎస్.హరిప్రసాద్ యాదవ్, ఎంపీడీవో సువర్ణలత, ఎంఈవో గోపాల్ అన్నారు. గురువారం మోడల్ స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో 'దేశం అభివృద్ధిలో విద్యా ర్థులు, వారి పాత్ర'పై పోటీలను నిర్వహించారు. విజేతలకు రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ బహుమతులను అందజేశారు. ఫ్రెండ్స్ విద్యానికేతన్ కరస్పాండెంట్ రామాంజులు, విద్యాసాయిస్కూల్ కరస్పాండెంట్ వెంకటమాధవ్, ప్రిన్సిపాల్ నవత, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

## క్రీడా పోటీలకు ఎంపిక

**అంతర్జాతీయ రోప్ పోటీలకు పవన్**



తుగ్గలి, సెప్టెంబరు 26: జాతీయ రోప్ పోటీల్లో విద్యార్థి పవన్ ప్రథమస్థానంలో నిలిచి, అంతర్జాతీయ రోప్ పోటీలకు ఎంపికయ్యాడు. మండలంలోని శభాష్‌పురం గ్రామానికి చెందిన చెన్నకేశవులు, విజయలక్ష్మి దంపతుల కుమారుడు పవన్ డోన్ పట్టణంలోని ఓ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన జాతీయ రోప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలివడంతో బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. బ్యాంకాక్ వెళ్లేందుకు తమ కుమారునికి ఆర్థికసాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. కాగా పోలీస్ సంఘం నాయకుడు పెద్దయ్య అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

**రాష్ట్ర స్థాయి పోటీలకు దీపిక, రాజేష్**


అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పెండేకల్ ఆర్‌ఎస్ పాఠశాల విద్యార్థులు దీపిక, రాజేష్ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం నరేంద్రప్రసాద్, పీఈటీ పాండురంగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ అమీనాబేగం తెలిపారు. అండర్-17లో ఈ నెల 28న వినుకొండలో క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని అన్నారు.

**జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు వెంకటేశ్వరమ్మ**



ఆదోని (అగ్రికల్చర్): అలసంద గుత్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వెంకటేశ్వరమ్మ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గిరిజాదేవి తెలిపారు. గురువారం విద్యార్థిని అభినందించారు. ఇటీవల ఆదోని లో నిర్వహించిన ఎస్జీఎఫ్ క్రీడా పోటీలలో అండర్ 14 కబడ్డీ పోటీలలో ప్రతిభ కనపరచడంతో జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు నాగప్రసాద్, శిరీష, మౌలాలి, శశికాంత్, అమినాబీ, నాయక్ కీర పాల్గొన్నారు.